www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 29 డిసెంబర్ 2023

ఎన్నికలకు సన్నద్ధం కావాలి : ఎస్‌పి

కడప అర్బన్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని, ఎలాంటి ఘటనలు జరగడానికి వీల్లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని ఎస్‌పి సిద్ధార్థ్ కౌశల్ పోలీస్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ రౌడీ షీటర్లకు, ట్రబుల్ మాంగర్లకు, చెడు నడత కలవారికి క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. వారి కదలికలపై నిఘా ఉంచాలని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ క్రిమినల్ కేసుల్లో ముద్దాయిలుగా ఉన్న రౌడీ షీటర్లకు సాక్ష్యాధారాలతో శిక్షలు పడేలా చర్యలు వేగవంతం చేయాలన్నారు. న్యాయస్థానాల్లో తగిన సాక్షాధారాలతో రౌడీ షీటర్లకు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటే తద్వారా వారి అక్రమ కార్యకలాపాలకు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వీలవుతుందని తెలిపారు. సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్)తుషార్ డూడీ, ప్రొద్దుటూరు ఎఎస్‌పి ప్రేర్ణా కుమార్, డిఎస్‌పిలు, సిఐలు పాల్గొన్నారు.

చాపాడు, వేంపల్లెలో కోతి, ఎద్దుకు వినతి పత్రాలు అందజేస్తున్న అంగన్వాడీలు

మీరైనా ఆలకించరూ..!

- ఎద్దు, కోతికి వినతి పత్రాల సమర్పణ
- చెవులు, కళ్లు, నోరు మూసుకుని అంగన్వాడీల నిరసన
- పలు చోట్ల పోస్టు కార్డుల ఉద్యమం
- 17వ రోజూ కొనసాగిన ఉద్యమం

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కడప జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఐసిడిఎస్, తహాశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల ఎదుట అంగన్వాడీలు పెద్ద ఎత్తున ఆందోళనలు కొనసాగిస్తున్నారు. గురువారం జిల్లా వ్యాపితంగా పోస్టు కార్డుల ఉద్యమం చేపట్టారు. మరికొన్ని చోట్ల వినూత్నంగా ఎద్దుకు, కోతికి వినతి పత్రాలు సమర్పించి 'మీరైనా మా సమస్యల ఆలకించరూ' అంటూ వేడుకుని నిరసన తెలియజేశారు. 17 రోజులైనా ముఖ్యమంత్రి సమ్మెపై పట్టీపట్టనట్లుగా వ్యవహరించడాన్ని 'చెవులు, కళ్లు, నోరు మూసుకుని' తమ నిరసన ను వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు. అంగన్వాడీల సమ్మెకు పార్టీలు, ప్రజలు, ప్రజా సంఘాల నుంచి సంపూర్ణ మద్దతు లభిస్తోంది.

కడప : అంగన్వాడీల సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పోస్టు కార్డుల ఉద్యమం నిర్వహించారు. కడపలో అంగన్వాడీ కార్యకర్తలు ముఖ్యమంత్రి అడ్రస్‌కు తమ సమస్యలను పోస్ట్ కార్డుపై రాసి ప్రాజెక్టు కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కడప పోస్టాఫీసు వద్దకు వెళ్లి కార్డులను పోస్ట్ బాక్స్‌లో వేసి సిఎంకు పంపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లక్ష్మి దేవి, నగర ప్రధాన కార్యదర్శి అంజనీ దేవి మాట్లాడుతూ 17 రోజులైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలను మంత్రులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడం లేదని, అందుకోసమే తామే నేరుగా ముఖ్యమంత్రి అడ్రస్‌కు సమస్యలను తీసుకెళ్తున్నామని అన్నారు. తాము రాసిన ఉత్తరాలు ముఖ్యమంత్రి గారికి చేరిన తర్వాత నైన తమ డిమాండ్లను పరిష్కరిస్తారని ఆశిస్తున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **వేంపల్లె :** 'ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి అంగన్వాడీల సమస్యలు పట్టలేదు.. నువ్వైనా మా సమస్యలు ఆలకించూ' అంటూ ఎద్దుకు అంగన్వాడీలు విన్నూతంగా వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ చేస్తున్న సమ్మె గురువారం నాటికి 17వ రోజుకు చేరుకుంది. ఎద్దుకు వినతిపత్రం అందజేసి ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి జ్ఞానోదయం కలిగించాలని కోరారు. జీతాలు పెంచాలని సమ్మె చేస్తున్నా ముఖ్యమంత్రి తనకు ఏమి కనపడనట్లు, వినపడనట్లుగా మౌనంగా కూర్చోవడం బాధాకరమని అంగన్వాడీ సంఘాల నాయకులు సరస్వతి, శైలజా, సావిత్రి చెప్పారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరి ంచడంలో సిఎం మొండి వైఖరి ప్రదర్శించడం దుర్మార్గం అన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయాలని మాత్రమే కోరుతున్నట్లు తెలిపారు. అంగన్వాడీల గ్రాట్యుటీతోపాటు నెలకు రూ. 26 వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేంపల్లె, చక్రాయపేట, వేముల అంగన్వాడీల మహిళాలు పాల్గొన్నారు. **చాపాడు :** 17 రోజులుగా వివిధ రకాలుగా నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు చాపాడులో గురువారం కోతికి తమ సమస్యలు పరిష్కరించాలని వినతి పత్రం అందజేశారు. అంగన్వాడీ కార్యకర్తలు తహాశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు .ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు సుజాత మాట్లాడుతూ ప్రభుత్వం తమ గోడు పట్టించుకోవడం లేదన్నారు. అందుకే కోతికి తమ బాధలను తెలియ జేస్తున్నామన్నారు.చాలీచాలని జీతాలతో కుటుంబ పోషణ కష్టంగా ఉందన్నారు. ఎన్నికలకు ముందు జగన్ వేతనాలు పెంచుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పులివెందుల టౌన్ :** ప్రభుత్వమిచ్చిన హామీలు అమలు, గ్రాట్యుటీ, సంక్షేమ పథకాల వర్తింపు తదితర డిమాండ్లతో అంగన్వాడీలు అలుపెరుగని పోరు కొనసాగిస్తున్నారు. గురువారం స్థానిక తహాశీల్దార్ కార్యాలయ ఆవరణలో వినూత్నంగా నోరు, కళ్లు, చెవులు మూసుకుని నిరసన తెలిపారు. అంగన్ వాడీలు పెద్దసంఖ్యలో సమ్మె శిబిరానికి తరలి వచ్చి ఆందోళన చేపట్టారు. తమ డిమాండ్ల అంగీకరించే వరకు సమ్మె విరమించిమన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు , ఆయాలు పాల్గొన్నారు. **మైదుకూరు :** ముఖ్యమంత్రి వై.ఎస్? జగన్మోహన్‌రెడ్డికి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరిం చాలంటూ మైదుకూరులో 17వ రోజు గురువారం అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సిడిపిఒ కార్యాలయం ముందు నిరసన తెలిపి పోస్ట్ ఆఫీస్ వరకు పోస్ట్ కార్డులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పోస్ట్ కార్డులో తమ డిమాండ్లను రాసి ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో 17వ రోజు అంగన్వాడీల చేతికి బేడీలను వేసి అరెస్ట్ చేసినట్లుగా నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యన్. భైరవప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎమ్మెల్యేలు అంగన్వాడీల పట్ల నిరంకుశత్వాన్ని వ్యవహరిస్తున్నారు. కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు చిన్నయ్య, జిల్లా కమిటీ సభ్యురాలు ఓబులాపురం విజయమ్మ, ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు వినోద, మేరి పోరుమామిళ్ల మండల కార్యదర్శి దస్తగిరిమ్మ, జ్యోతిమ్మ, రేణుకమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి, అంజనమ్మ, సుధా, స్వాతి, అంగన్వాడీలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** స్థానిక కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన గురువారం 17వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, రాజి, సునీత, నిర్మల, పద్మ, కృష్ణవేణి, విజయ, గురుదేవి, శివమ్మ , అర్బన్ సెంటర్ల అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు. ధర్నాకు మద్దతుగా బిఎస్‌పి ఇన్‌ఛార్జి పెద్దన్న యాదవ్ జనసేన పార్టీ నాయకులు జిలాన్, రామోజీ ప్రసాద్, లక్ష్మణ్ సింగ్, డివైఎఫ్ఐ నాయకులు డేవిడ్, మహిళా సంఘం కార్యదర్శి వెంకటసుబ్బమ్మ,అంగన్వాడీ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **దువ్వూరు :** అంగన్వాడీ కార్యకర్తలు ముఖ్యమంత్రికి తమ సమస్యలను పోస్ట్ కార్డుపై రాసి పోస్టుబాక్స్‌లో వేసి పంపారు. 17 రోజులైనా రాష్ట్ర ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించడం లేదని .తమ సమస్యలను మంత్రులు ముఖ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లడం లేదని అందుకోసమే తామే నేరుగా ముఖ్యమంత్రికి పోస్టుకార్డుల ద్వారా సమస్యను తెలియజేస్తున్నామని అంగన్వాడీలు పేర్కొన్నారు. **ముద్దనూరు :** స్థానిక తహాశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మెలో భాగంగా గురువారం అంగన్వాడీ కార్యకర్తలు తమ డిమాండ్లు, సమస్యలు పరిష్కరించాలని పోస్టు ఆఫీస్‌లోని పోస్టు బాక్స్‌లో కార్డులు వేసి తమ నిరసన తెలియజేశారు. **చెన్నూరు :** రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ పిలుపుమేరకు గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట చెన్నూరు మండల వ్యాప్తంగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సమ్మె నిర్వహించారు. ధర్నాకు టిడిపి మండల శాఖ పూర్తి మద్దతు ప్రకటించింది. కార్యక్రమంలో టిడిపి నాయకులు విజయ భాస్కర్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, చెన్నయ్య, అంగన్వాడీ యూనియన్ నాయకులు పద్మావతి, కాంతమ్మ, తులసమ్మ, లక్ష్మీదేవి పాల్గొన్నారు. ఆందోళనలు అనంతరం ఎంపిడిఒకు వినతి పత్రం అందజేశారు.

కడప : పోస్టు కార్డులను చూపుతున్న అంగన్వాడీలు

పులివెందుల : కళ్లు, నోరు, చెవులు మూసుకుని నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలు

ముద్దనూరు : పోస్టు బాక్సులో కార్డులు వేస్తున్న అంగన్వాడీలు

ప్రభుత్వాలను గద్దె దించాలి

రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తల డిమాండ్

ప్రజాశక్తి - కడప

అధికారంలోకి వచ్చాక కార్మిక చట్టాలను అమలు చేయని ప్రభుత్వాలను గద్దె దించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్, కంటిజెంట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని వక్తలు డిమాండ్ చేశారు. అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా, అంగన్వాడీ, మున్సిపల్, ఆశా, సర్వశిక్ష అభియాన్, వాలంటీర్ల సమస్యలపై గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట సిపిఎం కడప నగర కమిటీ కార్యదర్శి ఎ. రామ్మోహన్ అధ్యక్షతన సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్తగా హాజరైన సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 ఏళ్లు, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదేళ్లు గడిచి పోయిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కార్మిక వర్గానికి ఇచ్చిన ఎన్నికల హామీలు, వాగ్దానాలు ఇప్పటివరకు ఏ ఒక్కటీ అమలు కాలేదని వారి మాటలు నీటి మీద రాతల్లా మారిపోయాయని వాపోయారు. కనీస వేతనం రూ. 26 వేలు అమలు చేయాలని, నేటి ధరలకు అనుగుణంగా పెంచుతూ వెళ్లాలని చెప్పిందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తను చేసిన చట్టాలను కూడా అమలు చేయని దుస్థితికి దిగజారిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇంకా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సత్తార్, జనసేన నాయకులు సుంకర శ్రీనివాసులు మాట్లాడారు. సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు లక్ష్మీరెడ్డి, హరిప్రసాద్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా పార్టీ నాయకులు కృష్ణ, డిఎంకె పార్టీ నాయకులు సుబ్బరాయుడు, సిపిఐ ఎమ్మెల్యే న్యూ డెమోక్రసీ నాయకులు డబ్ల్యు.రాము, మహజాన్ పార్టీ నాయకులు సంగటి మనోహర్, సంఘ సేవ కులు సలావుద్దీన్, బీసీ నాయకులు అవ్వరు మల్లికార్జున, మైనార్టీ వెల్ఫేర్ అసో సియేషన్ నాయకులు బాబు భాయ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీని వాసులరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి రెడ్డి , ఐద్వా మహిళా సంఘం జిల్లా అధ్య క్షులు ఐ.ఎన్.సుబ్బమ్మ , అంగన్వాడీ యూనియన్ నాయకులు లక్ష్మీదేవి, మున్సి పల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రవి, తిరుపాలు, ప్రకాష్, డివై ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వి.శివకుమార్, కడప పట్టణ అధ్యక్ష , కార్యదర్శులు జి.ఓ బులేసు, ఎస్. షాకీర్, ఎస్.డి.పి.ఐ. నాయకులు చాంద్ బాషా, జహీరుద్దీన్, రాష్ట్ర నిరుద్యోగ పోరాట కమిటీ కన్వీనర్ ఎస్.సిద్ధిక్, సిపిఎం కడప పట్టణ కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, పెన్షన్ అసోసియేషన్ నాయకులు రైతు కూలీ సంఘం నాయకులు రవి పాల్గొని మాట్లాడారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

విద్యార్థులను శాస్త్రవేత్తలుగా చేయడమే లక్ష్యం

రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్ ప్రారంభోత్సవంలో డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

భవిష్యత్‌లో విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా ఆకాక్షించారు. గురువారం స్థానిక మరియాపురం సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రితోపాటు జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, ఎస్‌సిఇఆర్‌టి ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌ను కడప నగరంలో నిర్వహించుకోవడం ఎంతో సంతోషమని అన్నారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు ఒక సైన్స్ ఫెయిర్ ఏర్పాటు చేయడమంటే పాఠశాలల్లో, నగరంలో ఒక పండగ వాతావరణంగా ఉండేదని అన్నారు. అలాంటిది ఈ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ ప్రదర్శన కడప నగరంలో నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. పెద్ద సంఖ్యలో రాష్ట్రస్థాయి సైన్స్ వేర్ ప్రదర్శనకు పెద్ద సంఖ్యలో విద్యార్థిని విద్యార్థులు హాజరు కావడం అభినందనీయమన్నారు. భవిష్యత్ తరాలన్నీ సైన్సు పైనే ఆధారపడి ఉన్నాయని, పూర్వ శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకొని ఈ ప్రదర్శనకు వచ్చిన విద్యార్థుల ఆవిష్కరణలను అభినందించాలని చెప్పారు. సివి రామన్, ఎపిజె అబ్దుల్ కలాం వంటి వారిని ఆదర్శంగా తీసుకొని మనమందరం ముందుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఇక్కడ ఉన్న విద్యార్థులు అందరూ రాబోవు రోజుల్లో శాస్త్రవేత్తలుగా ఎదగాలని అన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్ కడప నగరంలో నిర్వహించడం ఎంతో సంతోషించదగ్గ విషయమని, విద్యార్థులు తమ విద్యలో సాధన చేస్తూ సృజనాత్మక ఆలోచన విధానం పెంచుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారం భించారు. అనంతరం అతిథులు సైన్స్ ఫెయిర్ ప్రదర్శన గదులను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. ప్రదర్శనలో ఉంచిన ప్రదర్శనలపై విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మహేశ్వర రెడ్డి, రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజం, రాష్ట్ర ఉద్యాన శాఖ రహదారులు సంబటూరు ప్రసాద్ రెడ్డి, ఎంఇఒ నారాయణ, ఇతర అధికారులు, కార్పొరేటర్ షేక్ మొహమ్మద్ షఫీ, నాయకులు నారపరెడ్డి సుబ్బారెడ్డి అహమ్మద్, ఎల్లారెడ్డి, ఉపాధ్యాయులు, 26 జిల్లాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి
- 3వ రోజు చెవిలో పువ్వులు పెట్టుకొని మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - కడప

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను జగన్మోహన్‌రెడ్డి తక్షణం నెరవేర్చి మాట నిలబెట్టుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా మూడవరోజు గురువారం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కడప నగరపాలక సంస్థ ఎదుట చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలైన కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికుల ఉద్యోగాల పర్మినెంట్, పనికి తగ్గ వేతనంతోపాటు మున్సిపల్ రంగంలోని ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్, పబ్లిక్ హెల్త్ పరిధిలో పనిచేస్తున్న చెత్త తరలించే వాహన డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మలేరియా, పార్కులలో పనిచేసే కార్మికులకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్, వాటర్ సప్లయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ కార్మికులకు కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జీతాల చెల్లింపు చేయాలన్నారు. సర్టిఫికెట్స్ లేవనే సాకుతో ఇంజినీరింగ్ కార్మికులకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్ది స్కిల్డ్, సెమీస్కిల్డ్ . జీతాలు , క్లాప్ డ్రైవర్లకు రూ. 18 500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ కార్మికులకు సంబంధించి సరెండర్ లీవులు, తదితర సమస్యల పరిష్కారం కోసం డిసెంబర్ 8న మున్సిలపల్ శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూల సురేష్, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి సి అండ్ డిఎంఎ పి కోటేశ్వరావుకు సమ్మె నోటీసు ఇచ్చారని చెప్పారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి లక్ష్మీదేవి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలుచేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా సమ్మెను నివారించేందుకు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నగర అధ్యక్షులు మాట్లాడుతూ తెల్లవారుజాము నుంచి నిర్వహిస్తున్న సమ్మెకు రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, కార్మిక సంఘాలు మద్దతునిచ్చి తోడ్పాటును ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. **మైదుకూరు :** మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో గురువారం మైదుకూరులో మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలన్నారు. పెరిగిన నిత్యవసర ధరల మేరకు కార్మికులకు రూ.26వేలు జీతం ఇవ్వాలన్నారు. సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి ఓపిస్ పెన్షన్ అమలు చేయాలని, కోవిడ్ -19 కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పేర్కొన్నారు. కార్మికులు చనిపోతే వారి కుటుంబాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సిఐటియు ట్రెజర్ జి చిన్న, లక్ష్మయ్య, కటసుబ్బయ్య, పుల్లమ్మ, విశ్వనాథం పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ ,సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి విజయ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని స్థానిక మస్టర్ పాయింట్ వద్ద చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, ఎస్ఎఫ్ఐ డివైఎఫ్ఐ బాధ్యుడు వినయ్ కుమార్ మరియు మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మున్సిపల్ కార్మికులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట చేస్తున్న నిరవధిక సమ్మె గురువారానికి మూడవరోజుకు చేరుకుంది. కార్మికులు చెవిలో పూలు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్మిక సంఘ (సిఐటియు అనుబంధం) గౌరవాధ్యక్షులు పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులనందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చంటి, పట్టణ కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి, నీతమ్మ, శాంతి, మరియమ్మ, నర్సమ్మ, అన్నపూర్ణ, మోహన్, ఓబయ్య, సురేష్, జాకోబు, సుధాకర్, లంకా రవి పాల్గొన్నారు. సమ్మెకు జనసేన నాయకులు జిలాని బాష, లక్షణ్ సింగ్, ప్రసాద్ మద్దతు తెలిపారు.

మున్సిపల్ కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసులురెడ్డి

సిఎం జగన్ హయాంలోనే అభివృద్ధి

కడప : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి. అంజాద్ బాషా, కె. సురేష్‌బాబు సంయుక్త పేర్కొన్నారు. గురువారం 6వ డివిజన్ పరిధిలో కొండాయపల్లె విద్యుత్ నగర్‌లో కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో సిసిరోడ్డు, కల్వర్టుల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరుగుతోందని అన్నారు. గత పాలకులు, నాయకులు నిర్లక్ష్యం వల్ల అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. విద్యుత్ నగర్‌లో జిజిఎంపి నిధుల కింద రూ.40 లక్షల అంచనా వ్యయంతో కాల్వ బ్రిడ్జి, 2 కల్వర్టులకు భూమి పూజ చేశారని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కార్పొరేటర్ నాగేంద్ర ప్రసాద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ బంగారు నాగయ్య యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

'జగనన్నా.. మెగా డిఎస్‌సి ఎక్కడ?'

ప్రజాశక్తి -కడప సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి విడుదల చేయాలని కోరుతూ నిరుద్యోగ జెఎసి, డివైఎఫ్ఐ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం కడప మహావీర్ సర్కిల్ నుంచి కడప కలెక్టరేట్ వరకు నిరుద్యోగుల ర్యాలీ నిర్వహించి వినూత్న రీతిలో మెడకు ఉరితాళ్లు బిగిగించి ఉద్యోగాలు ఇవ్వకుంటే ఆత్మహత్యలే శరణ్యమని అని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నిరుద్యోగ జెఎసి రాష్ట్ర కన్వీనర్ సిద్దిక్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో ప్రతిపక్షంలో వున్నప్పుడు అధికారంలోకి వస్తే ఏటా జాబ్ క్యాలెండర్, ఏటా డిఎస్‌సిని నిర్వహిస్తానని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చిన పూర్తిగా మరిచి పోయారని వాపోయారు. అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లయినా ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయలేదని పేర్కొన్నారు. ఇప్పటికే రాష్ట్రంలోని యువత ఉద్యోగ,ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు ,రాష్ట్రాలకు, గల్ఫ్ లాంటి దేశాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో 54 వేల పోస్టుల ఖాళీగా ఉన్నాయని పార్లమెంటులో చెబుతుంటే ఇక్కడ మంత్రులు మాత్రం అవగాహన లేకుండా అర్థరహితంగా తక్కువ మోతాదులో ఖాళీలు చూపుతున్నారు అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల డిఎస్‌సిని తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర అధ్యక్ష కార్యదర్శులు షాకీర్, డిఎం ఓబులేసు, నిరుద్యోగ జెఎసి నాయకులు నవీన్ కుమార్, సతీష్ పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ, జెఎసి నాయకులు, నిరుద్యోగులు

విఆర్‌ఎలకు కనీస వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి - కడప

విఆర్‌ఎలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అర్హతను బట్టి విఆర్ఒలుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని విఆర్‌ఎ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగేంద్ర, డి.వెంకటపతి డిమాండ్ చేశారు. గురువారం కడప కలెక్టరేట్ వద్ద విఆర్‌ఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 22 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులకు పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాత పద్ధతిలోనే అర్హులకు ఉద్యోగోన్నత ఇవ్వాలని పేర్కొన్నారు. రికవరీ చేసిన డిఎను తిరిగి చెల్లించాలన్నారు. డివైఎఫ్ఐ నగర కార్యదర్శి డి.ఎం. ఓబులేసు ధర్నాకు సంఘీభావం తెలియజేసి మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక విఆంలెలకు ఒక రూపాయి వేతనం పెంచకపోగా, గత ప్రభుత్వం ఇచ్చిన రూ.300 డిఎను రద్దు చేసిందని వాపోయారు. వేతనాలు పెంచాలని అనేకసార్లు అధికారులు, మంత్రుల చుట్టు తిరిగినా ఫలితం లేదని పేర్కొన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ నేటి అమలు కాలేదని తెలిపారు కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి కటారి అశోక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఏ. వెంకటరమణ, సిఐటియు నాయకులు ఉదయ్, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక దృష్టి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

కొత్త సంవత్సరంలో ప్రభుత్వం అమలు చేయబోయే సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు పండుగ వాతావరణంలో పంపిణీ చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. గురువారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా 2024 జనవరి నెలలో అమలు చేయనున్న నాలుగు ప్రధాన కార్యక్రమాల నిర్వహణ, తీసుకోవాల్సిన చర్యలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌కు కడప కలెక్టరేట్ విసి హాలు నుంచి జిల్లా కలెక్టర్, మైదుకూరు, రాజంపేట ఎమ్మెల్యేలు రఘురామిరెడ్డి, మేడా మల్లికార్జున రెడ్డి, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సలహాదారు రాజోలు వీరారెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివప్రసాద్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. సిఎంముగిసిన అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరిలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న కార్యక్రమాలకు సంబంధించిన కార్యక్రమాల నిర్వహణపై ప్రజల్లో అవగాహన పెంచేలా ప్రచారం చేయాలన్నారు. పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. జనవరి 1 నుంచి వైఎస్ఆర్ పెన్షన్, 23 నుంచి వైఎస్ఆర్ ఆసరా, ఫిబ్రవరి 5 నుంచి చేయూత వంటి పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, డిఆర్‌డిఎ, మెప్మా పీడీలు ఆనంద్ నాయక్, సురేష్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

క్రైస్తవులకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటా..

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

క్రైస్తవులకు ఎల్లప్పుడూ తోడుంటానని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైఎంఆర్ కాలనీలో ఉన్న ప్రవీణ్ కుమార్‌రెడ్డి స్వగృహంలో గురువారం 250 మందికి పైగా పాస్టర్లకు క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రిస్మస్ కేకు కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాస్టర్లను ఉద్దేశించి ప్రవీణ్ మాట్లాడుతూ తనకు శక్తి ఉన్నంత మేరకు క్రైస్తవులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా మంచి చేసే కార్యక్రమంలో ముందుంటానని తెలిపారు. ప్రొద్దుటూరులోని చౌటపల్లి వద్ద నికల్సన్ దొర చర్చి కోసం ఇచ్చిన మూడు ఎకరాలకుపైగా భూమిని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్లాట్లు వేసి విక్రయించారని, ఇది చాలా దారుణమైన విషయమన్నారు. 2024 ఎన్నికల్లో కచ్చితంగా ముఖ్యమంత్రిగా చంద్రబాబు వస్తారని, ప్రొద్దుటూరులో ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే ఇప్పటివరకు ఏ ఎమ్మెల్యే చేయని అభివృద్ధిని తాను చేసి చూపి స్తానని పేర్కొన్నారు. మాయ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రవీణ్ సూచించారు.

మాట్లాడుతున్న ఎంపిపి చీర్ల సురేష్ యాదవ్

ఆరోగ్యమే మహాభాగ్యం : ఎంపిపి

ప్రజాశక్తి-చెన్నూరు

ఆరోగ్యమే మహాభాగ్యమని తలంచి కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీని ప్రవేశపెట్టారని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరూ సరైన వైద్యం అందక చనిపోకూడదని భావించిన రాజశేఖర్ రెడ్డి ఆరోగ్యశ్రీ అనే పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రతి పేదవాడికి ప్రతి వ్యక్తికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందించడమే ధ్యేయంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఆయన కుమారుడు వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారని చెప్పారు. పథకాన్ని పేదలకు మరింత ఉన్నత స్థాయికి తీసుకెళుతూ రూ. 5 లక్షలు ఉన్న ఆరోగ్యశ్రీని ఇప్పుడు రూ. 25 లక్షలకు పెంచారని చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు ఆరోగ్య శ్రీ పథకం విధివిధానాలను వాటి ఉపయోగాలను ప్రజలకు వివరించాలని ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లకు సూచనలు చేశారు. ఆరోగ్యశ్రీ కార్డులను త్వరగా ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఎస్ఒ వెంకటసుబ్బయ్య, ఎంపిడిఒ సుబ్రమణ్యం శర్మ, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, డాక్టర్ సి.హెచ్. వంశీ, సొసైటీ అధ్యఒఉలు శ్రీరామ్మూర్తి, ఎంపిటిసి చంద్ర, ప్రజాప్రతినిధులు, వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ర్యాలీగా వెళుతున్న నాయకులు

జాతీయ సమావేశాల్లో ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

అఖిల భారత రాష్ట్ర.ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ సమావేశాలు కలకత్తాలో ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నాయకులతో పాటు, జిల్లా ఎపి ఎన్‌జిఒ నాయకులు హాజరయ్యారు. ఈనెల 30 వరకు కౌన్సిల్ సమావేశాలు 8 డిమాండ్లతో నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర అధ్యక్షులు బండి శ్రీనివాస్ రావు, ప్రధాన కార్యదర్శి కె . వి శివారెడ్డి, జిల్లా అధ్యక్షులు బి. శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై. ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి డి. రవికుమార్, కోశాధికారి పి నిత్య పూజయ్య. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి 35 మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదలకు బీమా డబ్బులు వేయాలి

- టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో రైతులు, కార్మికులు ఆత్మహత్యలు చేసుకోవటంలో మూడవస్థానం ఉందని, బాధిత కుటుంబాలకు బీమా డబ్బులు మంజూరు చేయాలని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. గురువారం కలెక్టర్ ఎఒని సమాచారం కోసం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సహజ లేదా యాక్సిడెంట్ జరిగిన వారికి చంద్రన్న బీమా వర్తించేదన్నారు. ఈ ప్రభుత్వంలో రైతులు, రైతు కూలీలు, కార్మికులు ఎక్కువగా ఆత్మహత్యలు చేసుకుంటున్నా బీమా అందడం లేదని వాపోయారు. కడప, కమలాపురం, మైదుకూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేల్, పులివెందుల నియోజకవర్గాల వారిగా సమాచారం ఇవ్వాలని సమాచారం హక్కు చట్టం 2005 ప్రకారం అడిగినట్లు తెలిపారు. ఏదో ఒక కారణాలతోనే - ఆర్థిక ఇబ్బందులతోనో బడుగు, బలహీన, మైనారిటీ, దళిత గిరిజన అగ్రవర్ణ పేదలు ఆత్మహత్యలు చేసుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం సరైన సమయంలో స్పందించడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ఆత్మహత్యలు చోటు చేసు కోకుడా చర్యలు తీసుకోవాలని, మరణించిన వారికి వైఎస్ఆర్ బీమాతో న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డిపిఐ జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాన్ బాషా, మైనారిటీ నాయకులు బాబయ్య పాల్గొన్నారు.

ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న మన్నూరు అక్బర్

పొలాలను కప్పేసిన పొగమంచు, మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారిపై లైట్లు వేసుకుని వస్తున్న వాహనాలు

రోడ్లు, పొలాలను కమ్మేస్తున్న పొగమంచు

రెండు రోజుల నుండి పొగమంచు అధికమైంది. రహదారులు ఏమాత్రం కనిపించకుండా పొగమంచు కమ్మేస్తోంది. ఈ క్రమంలో గురువారం అధికంగా పొగమంచు అలముకుంది. ఉదయం 8 గంటల వరకు కూడా రోడ్లు కనిపించడంలేదు. వాహనదారులు దారి కనిపించక నెమ్మదిగా భయాందోళన నడిపారు. కనీసం రెండు మీటర్ల దూరం కూడా దారి కనిపించనంత పొగమంచు కమ్మేసింది. ఈ నెల మెదటి వారంలో తుఫాన్ తాకిడితో చలిగాలులు వీస్తే ప్రస్తుతం మళ్లీ పొగమంచు అధికమైంది. దీంతో కొన్ని రకాల పంటలకు నష్టం వాటిల్లుతుందని రైతులు పేర్కొంటున్నారు. బుడ్డశనగ పంటకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని రైతులు పేర్కొంటున్నారు. - చాపాడు

క్రీడలతో మానసికోల్లాసం : జెసి

అధికారులతో మాట్లాడుతున్న జెసి గణేష్‌కుమార్

ప్రజాశక్తి - ముద్దనూరు

క్రీడలతో శారీరక ధృఢత్వంతోపాటు మానసికోల్లాసం కలుగుతుందని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మండల వ్యాప్తంగా జరుగుతున్న క్రీడల గురించి అధికారులతో చర్చించి, పలు సూచనలు చేశారు. వాలీబాల్ క్రీడాకారులను స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామునాయక్ పరిచయం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి, తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఇఒలు సుబ్బారావు, నాగేశ్వర నాయక్, ఈఓపిఆర్డీ వీరభద్రుడు, ప్రధానోపాధ్యాయులు రాజబాబు, సెక్రటరీలు సుమలత, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవరెడ్డి, దేవిక, యోగా మాస్టర్ రాంకుమార్ పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల నగర పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగాణంలో నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను గురువారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ పరిశీలించారు. క్రీడాకారులకు ప్రథమ చికిత్స, తాగునీరు, స్కోరు బోర్డు తదితర సదుపాయాలపై మున్సిపల్ కమిషనర్ పి.జగన్నాథ్‌ను అడిగి తెలుసుకున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు కల్పించాలని జెసి ఆదేశించారు. కార్యక్రమంలో తహశీల్దార్ నాగేశ్వరరావు, డిపిఒ వినోద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'కుష్టు రహిత సమాజమే లక్ష్యం'

సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా అధికారి రవిబాబు

ప్రజాశక్తి - చాపాడు

కుష్టు వ్యాధి రహిత సమాజమే లక్ష్యమని జిల్లా కుష్టు వ్యాధి నివారణ అధికారి డాక్టర్ రవిబాబు తెలిపారు. చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ బుధవారం నుండి జనవరి 12 వరకు జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నేపథ్యంలో ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, ఎఎన్ఎంలు, ఎంఎల్ హెచ్‌పిలు సర్వే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మండలాన్ని కుష్టు వ్యాధి రహితంగా చేసేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్లు శ్రీవాణి, కావ్య మాధురి, సిహెచ్ఒ మహాదేవ్ యాదవ్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి మాచనూరు రాఘవయ్య, సూపర్‌వైజర్ బాబురెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాజీపేట : కుష్టు వ్యాధి ప్రాణాంతకం కాదని వైద్యులు తెలిపారు. స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఎస్.ముబీన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కుష్టు వ్యాధి నివారణ జాయింట్ డైరెక్టర్, డాక్టర్ ఎస్.దేవసాగర్, జిల్లా అదనపు వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవిబాబుగారు, ఫిజియో థెరపిస్ట్ విక్టర్ మనోహర్ లెప్రసీ కేసు డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహించారు. ఇంటింటా కుష్టు వ్యాధి సర్వేను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూనవారిపల్లి సచివాలయంలోని పుల్లూరు దళితవాడ గ్రామం తనిఖీ చేశారు. కార్యక్రమంఒ డాక్టర్ ముబీన్, మండల ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, ఆశ నోడల్ పర్సన్ అరుణకుమారి, సూపర్‌వైజర్స్ శోభన్‌బాబు, బి.కృష్ణప్రియ, ఎంఎల్‌హెచ్‌సి స్వర్ణలత, రోజారమణి, ఆశా కార్యకర్తలు మేరీ, ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఉన్నతాధికారులు

పేదల అభివృద్ధికి తోడ్పాటునిచ్చేది కాంగ్రెస్ పార్టీనే

వేంపల్లెలో కాంగ్రెస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీ తోడ్పాటునిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధృవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ జెండాను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోనే ప్రజాస్వామ్య, లౌకిక, సామ్యవాద పార్టీ ఉందంటే ఒక కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కాంగ్రెస్ పార్టీలో ఉండడం చాలా గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, చెన్నకేశవ, ఉత్తన్న, బాలం సుబ్బరాయుడు, బద్రి, రాఘవయ్య, పీరుబాషా, మహబూబ్ బాషా (మాస్), వినయ్ పాల్గొన్నారు.

కడప : కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఆ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రియ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించుకున్నారు. తొలుత కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.ఈ సందర్భంగా విష్ణు ప్రితమ్‌రెడ్డి మాట్లాడుతూ భారత జాతీయ కాంగ్రెస్ భారతదేశ చరిత్రలో ఒక ముఖ్యమైన రాజకీయ శక్తిగా నిలిచిందన్నారు, దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిందని అన్నారు. కార్యక్రమంలో పిసిసి ఉపాధ్యక్షులు బండి జకరయ్య, పిసిసి ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, పిసిసి కార్యదర్శి చీకటి చార్లెస్, కమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోపూరు వెంకట రమణారెడ్డి, బిసి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోపూరి శ్రీనివాసులు, యూత్ కాంగ్రెస్ సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షులు కోటపాటి లక్ష్మయ్య , సిటీ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మధు రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు చెప్పలి పుల్లయ్య , ఓబీసీ జిల్లా అధ్యక్షులు కుల్లాయప్ప, అబ్దుల్ ఖాదర్, విద్యార్థి సంఘం జిల్లా నాయకులు మామిళ్ళ బాబు, శ్యామల దేవి, గౌరీ, సుబ్బారెడ్డి, వేణుగోపాల్, సూర్యం, నాగరాణి, పాలగిరి శివ పాల్గొన్నారు. **క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం..** కాంగ్రెస్ పార్టీ 139వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కడప జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బండి సుమంత్ కుమార్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రికెట్ టోర్నమెంట్‌ను బండి సుమంత్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు చక్రి, ప్రభు కుమార్, చిన్న, చెన్నయ్య, జగన్, వినోద్, ప్రభు కుమార్, ఖుషి, రాజా, రాజ్ కుమార్, రవికుమార్, భరత్ భరత్, శ్రీనాథ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ జెండా ఆవిష్కరణలో ఆ పార్టీ నాయకులు

క్రికెట్ టోర్నమెంట్లను నిర్వహించడం అభినందనీయం

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సలావుద్దీన్

ప్రజాశక్తి - కడప అర్బన్ : క్రీడలను ప్రోత్సహిస్తూ.. క్రీడాకారులను ఉత్సాహపరుస్తూ ఎన్నో క్రికెట్ టోర్నమెంట్లు నిర్వహిస్తున్న తారీక్ అలీ అభినందనీయుడు అని ప్రముఖ సంఘ సేవకులు సలావుద్దీన్ అన్నారు. ఐపిఎల్ క్రీడాకారుడు పైడికాల్వ విజయ్ పేరుతో కడప కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో గురువారం విజయ్ ప్రీమియర్ లీగ్ నిర్వహించారు. రెండవ మ్యాచ్‌కు అయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా సలావుద్దీన్ క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి టోర్నమెంటును ప్రారంభించారు. అనంతరం అయన మీడియాతో మాట్లాడుతూ ప్రముఖ క్రికెటర్ విజయ్ కుమార్ కడప క్రికెట్ అభివృద్ధిలో ఎంతగానో ఉపయోగపడ్డారని తెలిపారు. యువ క్రీడాకారులకు సూచనలు, సలహాలు ఇవ్వడంలో ఇప్పుడు ముందున్నారని గుర్తు చేశారు. అనంతరం తారీక్ అలీ మాట్లాడుతూ విజయ్ క్రికెట్ లీగ్ ఈనెల 22 నుంచి ప్రారంభమయ్యామయాయని చెప్పారు. జిల్లా నుంచి 14 జట్లు పాల్గొంటాయని చెప్పారు. విజయ్ ప్రీమియర్ లీగ్ ద్వారా యువతకు రక్త దానంపై అవగాహనా కల్పించుందుకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆన్‌లైన్ వాటర్ మ్యానుఫ్యాక్చర్ అధినేత సందాని, గుడ్ మ్యానర్స్ ఎంటర్ ప్రైజెస్ అధినేత ఫకృద్దిన్, సంఘ సేవకుడు మౌల అలీ సయ్యిద్ పాల్గొన్నారు.

చింతకుంటలో బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని చింతకుంట గ్రామంలో నాగూర్ ఖాదర్‌వలి స్వామి ఉరుసు సందర్భంగా గురువారం బండలాగుడు పోటీలను ఏర్పాటు చేశారు. ఈ పోటీలను దువ్వూరు టిడిపి అధ్యక్షులు బోరెడ్డి వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. గెలుపొందిన విజేత ఎడ్ల యజమానికి చింతకుంట టిడిపి నాయకులు కె.షరీఫ్ మొదటి బహుమతిగా రూ. 40,000 ప్రకటించారు. కార్యక్రమంలో దువ్వూరు మండల నాయకులు పాంనేని రాంబాబు, షరీఫ్, మహబూబ్ బాషా, జబ్బార్, మహబూబ్ బాషా, భాస్కర్‌రెడ్డి, గంగాధర్, కిట్టయ్య పాల్గొన్నారు

ఎడ్ల పందేలు ప్రారంభిస్తున్న బోరెడ్డి వెంకటరమణారెడ్డి

1న శ్రీఓబులేసు స్వామి కల్యాణోత్సవం

ప్రజాశక్తి - వేంపల్లె

నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా జనవరి 1న జరుగు శ్రీ ఓబులేసు స్వామి కల్యాణమహోత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి కోరారు. ఆ మేరకు గురువారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని కోనంపేట సమీపంలోని బి.యర్రగుడి గ్రామంలో వెలిసిన శ్రీ ఓబులేసు (శ్రీలక్ష్మి నరసింహ) స్వామి దేవస్థానంలో 1న సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి వారి కల్యాణం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహిస్తారన్నారు. అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఏడాది ఉమ్మడి కడప జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు శ్రీ ఓబులేసు స్వామి వారిని దర్శించుకొంటున్నట్లు చెప్పారు. టిటిడికి చెందిన ఆశోకాచార్యులు, మోహన్‌కృష్ణ బృందంచే పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కడప, రాజంపేట ఎంపీలు అవినాష్‌రెడ్డి, మిథున్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, టిటిడి సహకారంతో రూ.1.50 కోట్లతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చక్రపాణిరెడ్డి వివరించారు.

దాతలకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎసి

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ప్రజాశక్తి - చక్రాయిపేట

జిల్లాలో ప్రసిద్ధి చెందిన గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి పులివెందుల మండలం బసిరెడ్డిపల్లి వాస్తవ్యులు కలంకుంట్ల ఆదినారాయణరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు లక్ష్మీనారాయణరెడ్డి ధర్మపత్ని లక్ష్మీకాంత, రఘునాథరెడ్డి (యుకె) ధర్మపత్ని విజయలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.1,01,116 విరాళం అందజేసినట్లు దేవస్థానం సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. వీరికి ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ, ప్రసాదాలు, స్వామివారి చిత్ర పటం, శేష వస్త్రంతో వేద ఆశీర్వచనం చేసినట్లు పేర్కొన్నారు.

గ్యాస్ లబ్ధిదారుల ఇంటి వద్దే ఇకెవైసి చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

గ్యాస్ కనెక్షన్లు ఉన్న లబ్ధిదారులకు ఇకెవైసిని గ్యాస్ ఏజెన్సీలు వారి ఇంటి వద్దకే వచ్చి చేయాలని ఆర్ఎంపి వైద్యులు కరీముల్లా కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ కనెక్షన్లు ఉన్న లబ్ధిదారులు తప్పకుండా ఇకెవైసిని చేయించుకోవాలని చెప్పడంతో గ్యాస్ కార్యాలయం వద్దకు లబ్ధిదారులు గుంపులుగా వెళుతున్నారని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. దీన్ని గ్యాస్ ఏజెన్సీలు దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. అవసరమైతే స్పెషల్ డ్రైవ్‌గా చేపట్టి గ్యాస్ సిబ్బందితో ఇకెవైసి కార్యక్రమం చేపట్టాలని కోరారు.

'వాచర్' కుటుంబానికి ఆర్థిక సాయం

రామాపురం : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ప్రొడక్షన్ వాచర్ గోపాల్ మృతదేహానికి గురువారం ఫారెస్ట్ అధికారులు కడప డిఎఫ్ఒ వివేక్, అన్నమయ్య డిఎఫ్ఒ నాగమనేశ్వరి, రాయచోటి రేంజ్ అధికారి స్ఫూర్తి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.50వేలు ఆర్థిక సాయం అందించారు. వీరి వెంట రాయచోటి సెక్షన్ ఆఫీసర్ రఘు, శంకర్, రాయచోటి రేంజ్ ఆఫీస్ సిబ్బంది ఉన్నారు.

అన్నమాచార్యలో వక్తృత్వ పోటీలు

రాజంపేట అర్బన్ : బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో భారత దేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా తీర్చి దిద్దడం ఎలా అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యా పి.జాహ్నవి ప్రథమ బహుమతి సాధించగా, టి.శ్రావణి ద్వితీయ బహుమతి, డి.నేహారెడ్డి తృతీయ బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వినారాయణలు అభినందించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ నేటి పౌరుల చేతిలో రేపటి భారత దేశ భవిష్యత్తు ఉందని, వారు కష్టపడితే భారతదేశాన్ని 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా మలచవచ్చని అభిప్రా యంవ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌అండ్ఎస్ హెచ్ఒడి డాక్టర్ బి.బాల నాగేంద్రప్రసాద్, టచ్ స్టోన్ ఇన్‌ఛార్జి విజయ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూగర్భ నీటి నిల్వ పనులు తనిఖీ

చిన్నమండెం : భూగర్భ జలాలను పెంపొందించేందుకు దిగువగొట్టివిడులో ఏర్పాటుచేసిన కమ్యూనిటీ సోక్ పిట్‌ను , దేవుడిపల్లెలో బోర్వెల్ రీఛార్జ్ పనులను గురువారం సెంట్రల్ నోడల్ ఆఫీసర్ ప్రకాష్ కిప్పా, ఎఎస్.పవార్‌లు తనిఖీ చేశారు.జిల్లాకు సంభవించిన కరువు పరిస్థితుల గురించి రాయచోటి ఎపిడి రవికుమార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దివ్య, ఎపిఒ మాధవి, జెఇ హారున్‌బాషా , క్లస్టర్ టిఎలు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

యూనిక్ మిల్లెట్ మాల్ట్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల కేంద్రంలోని బ్రహ్మసాగర్ రోడ్డులో తిప్పన నాగార్జున ఏర్పాటు చేసిన కేఫ్, యూనిక్ మిల్లెట్ మాల్ట్‌ను మైదుకూరు శాసనసభ్యులు శెట్టిపల్లి రఘురామిరెడ్డి, ఎంపిపి వీరనారాయణరెడ్డి గురువారం ప్రారంభించారు. అతి తక్కువ ధరకే ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశామని నాగార్జున తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే, ఎంపిపిని సన్మానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎంపిపిని సన్మానిస్తున్న నాగార్జున